# ధరణి వచ్చింది..

# రైతు రాజ్యం తెచ్చింది..

ధరణిని తీసేస్తే.. దళారీ రాజ్యం వస్తది





సిర్పూర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన అశేష జనం



సిర్పూర్ సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి కోనేరు కోనప్ప

**తెలంగాణ ప్రజల కోసం, హక్కుల కోసం పుట్టింది బీఆర్ఎస్.** పార్టీకి కులం, మతం, జాతి అనే తేడా లేదు. అందరినీ కలుపుకుపోతున్నాం.. అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బుధవారం సిర్పూర్ నియోజకవర్గం అభ్యర్థి కోనేరు కోనప్ప, అసిఫాబాద్ నియోజకవర్గం అభ్యర్థి కోవా లక్ష్మికి మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ''బీఆర్ఎస్ పార్టీ చరిత్ర మీకు తెలుసు. అభివృద్ధి మీ కండ్ల ముందుంది. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో నష్టపోయాం.. బాధపడ్డాం. రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు, పరిశ్రమలు మూతపడటం రకరకాల ఇబ్బందులు చూశాం. పొట్ట చేత పట్టుకొని వలసలు పోయారు. ఈ పదేండ్లలో ఒక్కొక్కటి బాగుచేసుకుంటూ ముందుకు పోతున్నాం. ఇవ్వాళ 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. విద్యా, వైద్య వ్యవస్థను బాగుచేసుకున్నాం. ప్రైవేటు దోపిడీని తగ్గించాం. గురుకుల విద్యాసంస్థలు నెలకొల్పాం. డాక్టర్లు, ఇంజినీర్లను తయారు చేసుకుంటున్నాం. రైతు బంధు, రైతు బీమా ఇస్తున్నాం, నీటి తీరువా ఎత్తేశాం. బకాయిలు రద్దు చేసుకున్నాం. కనీస మద్దతు ధర ఇస్తూ.. పండిన పంటను ఏ ఊరికి ఆ ఊర్లోనే కొంటున్నాం. ధరణిని తీసుకువచ్చి దళారీ రాజ్యానికి చెక్ పెట్టాం.. మొత్తానికి ఇవాళ రైతుల ముఖాలు తెల్లపడ్డాయి. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణిని బంగాళాఖాతంలో వేసి.. దళారీ, పైరవీకారుల రాజ్యం తెస్తరంట. రైతులు ఆగమవుతారు. మీ ఓటు వజ్రాయుధం, భవిష్యత్‌ను నిర్ణయిస్తది. అందుకే ఏ ప్రభుత్వం ఏం చేసిందో లెక్క తీసి.. ఎవరు గెలిస్తే మంచిదో.. నిర్ణయించి ఓటేయాలి. అభివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇదే విధంగా అభివృద్ధి చెందాలి కాబట్టి.. బీఆర్ఎస్ గవర్నమెంట్ మళ్లీ రావాలి.'' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

**సిర్పూర్..**

సిర్పూర్ గురించి మంచం పట్టిన మన్యం అని వార్తలు వస్తుండే. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లంబాడీ, ఆదివాసీ గూడెంలకు భగీరథ నీళ్లు వస్తున్నాయి. కరెంటు బాధ లేదు. నియోజకవర్గంలో 16వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చాం. గిరిజనులపై ఉన్న కేసులు ఎత్తేశాం. గిరిజనేతర బిడ్డలకు పట్టాలు వస్తాయి. దానికి ఆటంకం కేంద్ర ప్రభుత్వమే. కఠినమైన రూల్స్ పెట్టారు. లెక్కలు తీసి కేంద్రానికి పంపించాం. ఎన్నికల తర్వాత పోరాటం చేసి గిరిజనేతరులకు కూడా పట్టాలు అందజేస్తాం. కాగజ్‌నగర్ ఒకప్పుడు మినీ ఇండియాలాగ ఉండే. మిగిలిన ఖార్ఖానాలు తెరిపిస్తాం. మళ్లీ పూర్వ వైభవం తీసుకువస్తాం.

**అసిఫాబాద్..**

అసిఫాబాద్‌లో 47వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చాం. వారందరికీ రైతు బంధు ఇస్తున్నాం. రైతు బీమా పెట్టుకున్నాం. ఆదివాసీ, లంబాడీ తండాలకు త్రీ ఫేజ్ కరెంటు సదుపాయం కూడా కల్పిస్తున్నాం. ఇంకా మిగిలి ఉంటే అదికూడా పూర్తవుతుంది. ఆరె కులస్తులను ఓబీసీలో చేర్చే ప్రయత్నం చేస్తాం. మాలి కులస్తుల విషయంలో మేం తీర్మానం చేసి పంపించాం. కానీ కేంద్రం పట్టించుకోవడం లేదు. వారి సంక్షేమానికి ప్రత్యేక నిధులు వెచ్చిస్తాం.

- కాంగ్రెస్ హయాంలో ఆత్మహత్యలు, ఆకలి చావులు
- పరిశ్రమలు మూతపెట్టించి.. వలసలకు సాగనంపింది వాళ్లే
- రైతుబంధు దుబారా అన్నోళ్లకు దమాక్ ఉన్నదా..?
- 24గంటలు కరెంటు వద్దంట.. కాంగ్రెసోళ్లు 3 గంటలే ఇస్తారంట
- వాళ్లు ఇవ్వరు.. ఇచ్చేటోళ్ల మీద నిందలా..?
- కేంద్రంతో పోరాడి.. గిరిజనేతరులకు పట్టాలు అందజేస్తాం
- కనీస మద్దతు ధర ఇస్తున్నాం.. ఏ ఊర్ల పండిన పంటను ఆ ఊర్లనే కొంటున్నాం..
- విద్యా, వైద్య వ్యవస్థను బాగుచేశాం.. ప్రైవేటు దోపిడీని తగ్గించాం
- సిర్పూర్, అసిఫాబాద్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్





ఆసిఫాబాద్ సభలో ప్రసంగిస్తున్న అభ్యర్థి కోవా లక్ష్మి, హాజరైన జనం





బెల్లంపల్లి ప్రజా ఆశీర్వాద సభకు పోటెత్తిన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

# చెన్నూరులో చెల్లని రూపాయి..

# బెల్లంపల్లిలో చెల్లుతుందా..?

ప్రజల ఆశీర్వాదమే మనకు శ్రీరామ రక్ష

## ఇవ్వాల టికెట్లు అమ్ముకున్నోడు.. రేపు రాష్ట్రాన్ని అమ్ముకోడా..?

- ఆనాడు తెలంగాణను గోసపెట్టింది.. కరువుపాలు చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా..?
- సింగరేణిలో 19వేల ఉద్యోగాలు.. 45 వేల మంది కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇచ్చినం
- అభివృద్ధి చెందుతున్న తెలంగాణను చూసి ఓర్వలేకపోతున్నరు
- గుడ్డిగ ఓటేస్తే.. దెబ్బ తింటం.. జాగ్రత్త
- బెల్లంపల్లి ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

"కాంగ్రెసోళ్లు ఇవ్వాళ డబ్బుల కట్టలు పట్టుకొని దిగుతున్నరు. ఎన్నికలు అయిపోతే మళ్లీ కనబడరు. ఇక్కడికి వచ్చిన కాంగ్రెస్ మనిషిని చెన్నూరు ప్రజలు నాలుగుసార్లు ఓడగొట్టారు. మన బెల్లంపల్లిలో ఉన్నవాళ్లము తెలివి తక్కువ వాళ్లమా..? మరి రుజువు చేయాలి. అక్కడ చెల్లని రూపాయి ఇక్కడ ఎట్ల చెల్లుతది.. వాళ్లు తిరస్కరించిన తర్వాత మనం ఎట్ల గెలిపిస్తాం. ఎన్నికలు రాగానే డబ్బు సంచులు పట్టుకొని దిగాలా.. వాన్ని వీన్ని కొని గోల్ మాల్ చేయాలా.. ఇదే వారి పని. చిన్నయ్య నువ్వేం ఫికర్ చేయకు. ఎవడో నలుగురు అమ్ముడు పోయినంత మాత్రాన వాడు తలమాసినోడు అవుతడు కానీ మనం కాము. ప్రజలు నీ పక్షాన ఉంటారు. ప్రజల ఆశీర్వాదమే మనకు శ్రీరామ రక్ష."



బెల్లంపల్లి ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి చిన్నయ్య

**''కాంగ్రెస్ పార్టీ ఎంత గొప్పదంటే.. పీసీసీ అధ్యక్షుడే టికెట్లు అమ్ముకున్నాడని గాంధీ భవన్ దగ్గర ప్రతి రోజూ లొల్లి.. గాంధీ భవన్ గేట్లకు తాళాలు వేసుడు. ఇవ్వాల టికెట్లు అమ్ముకున్నోడికి రాష్ట్రాన్ని అప్పజెప్తే.. రేపు రాష్ట్రాన్ని అమ్ముకోడా.? పార్టీ టికెట్లు అమ్ముకునేటోళ్లు కావాల్నా.. ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్ కావాల్నా..? దయచేసి ప్రజలు ఆలోచన చేయాలి. మీ దీవెన ఉంటే తెలంగాణను ఈ దేశంలోనే నంబర్ స్టేట్‌గా తీర్చిదిద్దుతాం.''** అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి నియోజకవర్గం అభ్యర్థి చిన్నయ్యకు మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రసంగించారు. ''ఆనాడు ఉన్న తెలంగాణను ఊడగొట్టి.. గోస పెట్టిందెవరు.? కరువు పాలు చేసిందెవరు.? వందలాది మంది విద్యార్థుల చావులకు కారణం కాంగ్రెస్ పార్టీ కాదా..? ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకుంటుంటే ఓర్వలేక పోతున్నరు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను ఊడగొట్టింది.. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఉద్యోగులను పునరుద్ధరించినం. సింగరేణిలో 45వేల మంది కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇచ్చినం.. ఇంక్రిమెంట్లు ఇచ్చినం.. 19,400 ఉద్యోగాలు కల్పించినం. ఈ అభివృద్ధి ఇలానే జరగాలంటే బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలి. కాంగ్రెస్‌కు అప్పగిస్తే రైతుబంధుకు రాంరాం.. పట్వారీలు, దళారీల రాజ్యం వస్తది. ఆగమైపోయే అవకాశం ఉంటది. మీ అవసరాలు, మంచి చెడు గురించి మీ ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలి.'' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.






మంచి చేసినవు సారు.. మళ్లీ తప్పక వస్తావు సారు